క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన మైనార్టీ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆసిఫాబాద్: ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ బొర్కడే హేమంత్ సహదేవరావును బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు అహ్మద్‌బిన్ అబ్దుల్లా, నాయకులు సయ్యద్‌నిసార్, ఎండీ అహ్మద్, ఇమ్రాన్, సయ్యద్ అహ్మద్ షా తదితరులు ఉన్నారు.

మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యం



భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కౌటాల: పల్లెలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని శివలింగపూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రూ.1.50 కోట్ల నిధులతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వొజ్జల మౌనిశ్, ఉప సర్పంచ్ తిరుపతి, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు బండి శ్రీనివాస్, నహీం హైమద్, డబ్బా బాపు, సంతోష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం



బిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కాగజ్‌నగర్‌రూరల్: యువకులు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మండలంలోని భట్‌పల్లి గ్రామంలో సామాజిక కార్యకర్త, ఆర్‌పీఎం వంగిరి ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. ఈ శిబిరంలో 35 మంది యువకులు, మహిళలు రక్తదానం చేశారు. ఆసిఫాబాద్ బ్లడ్‌బ్యాంకు డాక్టర్ నవేద్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ పిర్సింగుల పోచయ్య, సర్పంచ్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కౌటాల: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంఎల్‌హెచ్‌పీ ప్రవళిక అన్నారు.మండలంలోని గుండాయిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం యోగా మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వారికి యోగాసనాలు నేర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ ఆధ్వర్యంలో ప్రతి వారం పాఠశాలల్లో యోగా మెడిటేషన్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. హెచ్‌ఎం హన్మంతు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

రెబ్బెన: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ టీఎఫ్‌టీ నూతన సంవత్సర క్యాలెండర్లను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి చరణ్‌దాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం ఎస్సీ, ఎస్టీ టీఎఫ్‌టీ ఎంతో కృషి చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు ప్రభాకర్, యశ్వంత్, గోపాల్, శ్రీదేవి, అనీస్ అహ్మద్, తుకారాం, సదానందం, జమునదాస్, వసీం, శ్రీధర్, దేవేందర్ పాల్గొన్నారు.

'ప్రధానిని విమర్శించడం సరికాదు'

కాగజ్‌నగర్‌టౌన్: బడ్జెట్ సమావేశాల్లో ప్రధాని మోదీని విమర్శించడం సరికాదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోలెం వెంకటేశ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2023–24 సంవత్సరానికి గాను రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్, వివిధ పద్దులపై చర్చించకుండా కేంద్రాన్ని, మోదీని విమర్శించడం సరికాదని పేర్కొన్నారు. కేవలం ముఖ్యమంత్రిని ప్రశంసించడం కోసమే ఏర్పాటు చేసుకున్న భజన సమావేశంలాగా ఉందని విమర్శించారు.

భక్తుల కొంగుబంగారం.. సిద్ధి హనుమాన్

- 16 నుంచే ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు
- పురాతన మందిరంగా ప్రసిద్ధి చెందిన తాటిపల్లి కుర్తా
- 18న ఆలయంలో మహాజాతర



ముస్తాబైన తాటిపల్లి హనుమాన్ ఆలయం

కౌటాల: మండలంలోని తాటిపల్లి గ్రామ సమీపంలో వార్దా నది ఒడ్డున వెలసిన శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయం మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా మహాశివరాత్రి సందర్భంగా మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వార్దా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకుంటారు.

రెండు రాష్ట్రాల భక్తుల రాక..

తాటిపల్లి హనుమాన్ ఆలయం ఇటు తెలుగు, అటు మరాఠా ప్రజల సాంప్రదాయాలకు నిలయంగా ఉంది. ఏటా శివరాత్రికి ఇక్కడ జరిగే జాతరకు వార్దా నదికి ఆవలి ఒడ్డున ఉన్న మహారాష్ట్ర భక్తులు ఇటు తెలంగాణలోని భక్తులు వచ్చి తమ సంప్రదాయాల ప్రకారం మొక్కులు చెల్లించుకుంటారు. జాతర సందర్భంగా రెండు రాష్ట్రాల భక్తులు కలుసుకొని సామూహిక భోజనాలు చేస్తుంటారు. జాతర నిర్వహించే వారం రోజులు వివిధ రకాల మరాఠీ, తెలుగు సాంస్కృతిక కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు నిర్వహిస్తారు.



ఆలయంలోని హనుమాన్ విగ్రహం

శివరాత్రి ఉత్సవాలు

మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయం వద్ద మహాజాతర, ఇతర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు ఆలయంలో ప్రతిరోజు ఉదయం 6 గంటలకు మహాహారతి, మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భజన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 18న ఆలయంలో మహా జాతర నిర్వహించనున్నారు. జాతర రోజు ఆలయం వద్ద 'సాసుఛ్యా ఘరాత్ సున్ బాయి జోరాత్' అనే మరాఠి నాటక ప్రదర్శన నిర్వహించనున్నారు.

మహాజాతరకు ఏర్పాట్లు పూర్తి



గత 38 ఏళ్ల నుంచి తాటిపల్లి హనుమాన్ ఆలయంలో మహాశివరాత్రి జాతరను ఘనంగా నిర్వహిస్తున్నాం. భక్తిశ్రద్ధలతో ఆలయంలో నాలుగు రోజుల పాటు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తాం. జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– ఎల్ములే దత్తు, ఆలయ కమిటీ అధ్యక్షుడు, తాటిపల్లి

బస్సు సౌకర్యం కల్పించాలి



తాటిపల్లి కుర్తా శ్రీ హనుమాన్ ఆలయానికి వెళ్లడానికి భక్తులకు బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. జాతరకు భక్తులు వేల సంఖ్యలో వస్తుంటారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి వార్దానదిలో భక్తులు పుణ్యసాన్నాలు ఆచరిస్తారు. నది వద్ద ప్రభుత్వం స్టీమర్లు ఏర్పాటు చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తాటిపల్లికి ఆర్టీసీ బస్సు సేవలు కల్పించాలి.

– బొమ్మకంటి దివాకర్, భక్తుడు, మొగడ్‌దగడ్

భవిష్యత్తుకు పునాది..ఇంటర్ ప్రాక్టికల్స్

- మెలకువలు పాటిస్తే మార్కులు
- నేటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాల

కెరమెరి: పదో తరగతి తొలిమెట్టయితే ఇంటర్మీడియట్ విద్యార్థి భవిష్యత్తుకు పునాది. ఇందులో వచ్చే మార్కులు ఉన్నత చదువులకు ఎంతో కీలకంగా మారనున్నాయి. ఇంటర్ పరీక్షలు ఒక ఎత్తయితే ప్రయోగ పరీక్షలు(ప్రాక్టికల్స్) మరో ఎత్తు. ఇవి బాగా రాస్తేనే మంచి మార్కులు సాధించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నేటి నుంచి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో 23 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 2,713, ఒకేషనల్‌లో మొత్తం 1,463 మంది విద్యార్థులు కాగా, మొత్తం 4,176 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

సంతరించుకున్న ప్రాధాన్యం

నిర్వహణ తీరు మారడంతో ప్రయోగ పరీక్షలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆన్‌లైన్ విధానంలో ప్రశ్నపత్రం డౌన్‌లోడ్ చేసుకోవడం మొదలు మూల్యాంకనం అనంతరం మార్కులు వేసుకునే వరకు అన్ని ప్రక్రియలు సాంకేతిక విధానంతో కొనసాగనున్నాయి. తద్వార ప్రయోగ పరీక్షల ప్రక్రియ అంతా పారదర్శకంగా సాగనుంది. అలాగే ఒక్కో సబ్జెక్టుల్లో 30 మార్కుల ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో బైపీసీ విద్యార్థులకు నాలుగు సబ్జెక్టులు, ఎంపీసీ విద్యార్థులకు రెండు సబ్జెక్టులకు సంబంధించి పరీక్షలు రాయల్సి ఉంటుంది. మూడు గంటల వ్యవధి ఇస్తారు. సాంకేతిక ఆధారంగా పరీక్షలు జరుతున్నందున ద్వితీయ సంవత్సర విద్యార్థులు జాగ్రత్తగా పరీక్షలు రాస్తే అధిక మార్కులు సాధించే అవకాశం ఉంది. ఈ పరీక్షలు 19 వరకు కొనసాగనున్నాయి.

అన్ని ఏర్పాట్లు చేశాం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభం కానున్న ప్రాక్టికల్స్ పరీక్షలకు అన్ని ఏర్పాటు చేశాం. ఈ పరీక్షలు 19 వరకు కొనసాగనున్నాయి. ఆదివారం పరీక్ష కొనసాగుతుంది. విద్యార్థులు ప్రతిరోజు సమయానికి పరీక్షలకు హాజరు కావాలి.

– పరుశురాము, ప్రిన్సిపాల్, కెరమెరి

పుల్వామా అమరులకు నివాళి



కౌటాలలో కొవ్వొత్తులతో ర్యాలీ

కౌటాల: పుల్వామా దాడిలో అమరులైన సైనికులకు మండల కేంద్రంలో యువకులు, నాయకులు నివాళులర్పించారు. మంగళవారం కౌటాల ఆర్టీసీ బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ప్రధాన రహదారిపై కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్, కౌటాల సర్పంచ్ మౌనిశ్, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ పాల్గొన్నారు.

గ్రామసభను బహిష్కరించిన ప్రజలు



అధికారులు లేక వెలవెలబోయిన కుర్చీలు

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు మంగళవారం నిర్వహించిన గ్రామసభకు అధికారుల గైర్హాజరుతో ప్రజలు బహిష్కరించారు. ప్రత్యేక అధికారి రమేశ్, పంచాయతీ ఇన్‌చార్జి ఈవో వంశీకృష్ణలు గ్రామసభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఉదయం 10 గంటలకు గ్రామసభ ప్రారంభం కావల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటలు దాటినా ఏ అధికారి హాజరుకాకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాఖల అధికారులు లేనప్పుడు మా సమస్యలు ఎవరికి చెప్పాలని పంచాయతీ అధికారులను ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో అధికారులు హాజరయ్యేలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభను పది రోజుల్లోగా తిరిగి నిర్వహించేలా చూడాలన్నారు.

పుల్వామా అమరవీర జవాన్లకు నివాళులు

పుల్వామా ఘటనలో అమరులైన వీర జవాన్లను స్మరించుకుంటూ గ్రామసభకు హాజరైన అధికారులు, ప్రజలు నివాళులర్పించారు. మూడు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న ఉగ్రవాదులు భారత వీర జవాన్లను దారుణంగా హతమార్చడం బాధాకరమన్నారు. జవాన్ల త్యాగం దేశానికి తీరని లోటన్నారు. ఫిబ్రవరి 14వ తేదీ దేశానికి చీకటి రోజని పేర్కొన్నారు. అమరుల త్యాగాలను దేశప్రజలు ఎప్పుడు మర్చిపోరని, వారి కుటుంబాలకు ప్రజలు రుణపడి ఉంటారన్నారు.

డిస్పెన్సరీలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో డిస్పెన్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరునెలలుగా తాగునీటి సౌకర్యం లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పేషంట్లు ఎక్కువ సంఖ్యలో వస్తే ఉండటానికి క్యాజువాలిటీ సౌకర్యం లేదన్నారు. ప్రధానంగా ల్యాబ్‌లో టెస్టులు చేసే మైక్రోస్కోప్ చెడిపోయి ఏడాదవుతున్నా మరమ్మతుకు నోచుకోవడం లేదన్నారు. వారం రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఉత్పత్తిని స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీఎం కమిటీ సభ్యులు సమ్మయ్య, రవీందర్, వెంకటేశ్వర్లు, ఏరియా నాయకులు సంపత్, కుమారస్వామి, ఫిట్ కార్యదర్శులు చంద్రయ్య, విజ్ఞన్న, నాయకులు స్వామి, మహేష్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

రెబ్బెన: మండల కేంద్రంలోని సీతా రామాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతా రామలక్ష్మణ అంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌కుమార్ జైస్వాల్, మాజీ జెడ్పీటీసీ పల్లె ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

కాగజ్‌నగర్‌రూరల్: ఒకటి కాదు, రెండు కాదు ఇప్పటికి 26 సార్లు రక్తదానం చేసి ఈ యువకుడు అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. మండలంలోని భట్‌పల్లి గ్రామానికి చెందిన పిప్పిరి రాధాకృష్ణ. గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన రక్తదానశిబిరంలో రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో క్రమంలో రక్తం కోసం రోగులు పడే తపనను చూసి చలించి రక్తదానం చేశారు.

ఆటో యూనియన్ ఎన్నిక

సిర్పూర్(టి): మండల ఆటో యూనియన్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దామరపల్లి వెంకటేశ్, అధ్యక్షుడిగా రాపర్తి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా జబీఉల్లా ఖాన్, ఎండీ ఉద్రీస్, కోశాధికారులుగా కె.సురేష్, అబ్దుల్ తాజ్, కార్యదర్శిగా సయ్యద్ మోయిజ్, సంయుక్త కార్యదర్శులుగా అబ్దుల్ షాహిద్, నులిగొండ రాజశేఖర్, ప్రచార కార్యదర్శిగా ఎండీ జాకీర్, టి.విజయ్ కుమార్, సభ్యులుగా ఫైసల్ ఉల్లాఖాన్, నాయిని సత్తి, టేకం భీంరావు, దుర్గం రవి ఎన్నికయ్యారు.

దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తాం



ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీపీ, ఎంపీడీవో

కెరమెరి: మండలంలోని భోలాపటార్ పంచాయతీ పరిధి రాంనగర్ గ్రామంలో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మంగళవారం రాంనగర్ గ్రామాన్ని వారు సందర్శించారు. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడంతో కాలిబాటతో వెళ్లారు. ఈ సందర్భంగా ప్రజలు తమ గోడును వెల్లబోసుకున్నారు. రోడ్డు సౌకర్యం లేక ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని, తాగునీరు లేక ఇక్కట్లు పడుతున్నామన్నారు. మిషన్ భగీరథ లేదని, పాడుబడిన బావిలోంచి నీరు తాగుతున్నామని చెప్పారు. స్పందించిన ఎంపీపీ, ఎంపీడీవో ఈజీఎస్ నిధులతో బావిని తవ్వించి తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈజీఎస్ ద్వారానే మట్టి రోడ్డు వేసేందుకు కృషిచేస్తామన్నారు. వారి వెంట సెక్రటరీ మల్లేశ్ తదితరులు ఉన్నారు.

'రాష్ట్రంలో అమలయ్యే పథకాలన్నీ కేంద్రానివే'



పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

తిర్యాణి: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానివేనని 'ప్రజాగోస బీజేపీ భరోసా' కార్నర్ మీటింగ్ ప్రోగ్రాం ఇన్‌చార్జి ధోని శ్రీశైలం అన్నారు. మండలంలోని ఖైరిగూడ, తిర్యాణి, రాళ్లకన్నెపల్లి, కన్నెపల్లి గ్రామాల్లో మంగళవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచకమైన కుటుంబ పాలన నడుస్తోందని మండిపడ్డారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాల పేర్లు మార్చి రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిపొందాలని చూస్తోందన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్రంలో గడప గడపకూ తీసుకెళ్లేందుకే ప్రజాగోస బీజేపీ భరోసా అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట్నాక విజయ్‌కుమార్, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్మరాం నాయక్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, కోకన్వీనర్ సారా రమేశ్‌గౌడ్, మండల అధ్యక్షుడు పులి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: జీవో నంబర్ 60 ప్రకారం గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయు జిల్లాప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని భట్‌పల్లి జీపీ ఆవరణలో గ్రామపంచాయతీ కార్మికుల పాదయాత్ర పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల మాదిరిగానే పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచాలని, ప్రమాదబీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఈనెల 12 నుంచి పాలకుర్తిలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ నాయకత్వంలో పాదయాత్ర ప్రారంభమైందన్నారు. దీనికి సంఘీభావంగా ఈనెల 20న జిల్లా కేంద్రంలోని ఆంజనేయ విగ్రహ నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి, ధర్నా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, సంతోశ్, కార్తీక్, రాజు, రమేశ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారం'



కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీనివాస్

పెంచికల్‌పేట్: వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారమని పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. 'ప్రజాగోస బీజేపీ భరోసా' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కమ్మర్‌గాం గ్రామంలో మంగళవారం కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జునుగరి మధుకర్, జిల్లా నాయకులు అరుణ్, వీరభద్రచారి, భాస్కర్, నగేశ్, తిరుపతి, రాజేశ్వర్, అమిత్, రన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాబోధనకు టీఎల్‌ఎం ప్రామాణికం

కెరమెరి: విద్యాబోధనకు టీఎల్‌ఎం ప్రామాణికమని, అందుకు ప్రతి ఉపాధ్యాయులు టీఎల్‌ఎం ద్వారా విద్యాబోధన చేయాలని గోయగాం కాంప్లెక్స్, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి నల్లగొండ రమేశ్ అన్నారు. రింగన్‌ఘాట్ పాఠశాలలో కొనసాగుతున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని మంగళవారం పరిశీలించారు. హెచ్‌ఎం రతన్ ఉన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ

కౌటాల: మండలంలోని తాటిపల్లి సమీపంలోని శ్రీ సిద్ధి హనుమాన్ ఆలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల పోస్టర్‌ను మంగళవారం కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతర సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయకమిటీ చైర్మన్ ఎల్ములే దత్తు కోరారు.

- వీర్దండి సమీపంలోని జై బీర్య హనుమాన్ మందిర్ ప్రశాంత్‌ధామ్‌లో నిర్వహించే మహాశివరాత్రి జాతరను భక్తులు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు పర్చాకి బండు కోరారు. యోగా గురు ఆచార్య అశోక్ ఆర్య ఆధ్వర్యంలో మహా యజ్ఞం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఇరుకు వంతెనతో ఇక్కట్లు



ఇరుకు వంతెన గుండా ప్రయాణిస్తున్న లారీ

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ నుంచి పెంచికల్‌పేట్ వెళ్లే ప్రధాన రహదారిలో గల ఈజ్‌గాం శివమల్లన్న ఆలయ సమీపంలోని ఇరుకైన వంతెనతో వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ మార్గం గుండా కాగజ్‌నగర్ మండలంతోపాటు పెంచికల్‌పేట్, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం మండలాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. దీంతో ఈ మార్గం ఎల్లప్పుడూ రద్దీగా ఉంటుంది.

గతంలో ప్రమాదాలు..

ఇరుకైన వంతెన కారణంగా ఈ ప్రాంతంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. 2018లో జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఒకరు గాయపడ్డారు. 2019లో ఇద్దరు, 2020లో నలుగురు ప్రమాదానికి గురై మృతిచెందారు. అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. డబుల్ రోడ్డు ఉండటంతో వాహనాలు స్పీడ్‌గా వస్తుంటాయి. అయితే వంతెన ఇరుకుగా ఉండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఈరోజు

నేడు వేలం

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలలోని శిథిలావస్థ భవనంలోని టేకు కర్ర, పెంకలు, రాళ్లకు బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం భానుప్రకాశ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు ఆధార్‌కార్డు జిరాక్స్, రూ.వెయ్యి ధరవత్తు చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

రామారావు మహరాజ్ విగ్రహ ప్రతిష్టాపన

కెరమెరి: మండలంలోని పీహెచ్‌సీకి వెళ్లేదారి సమీపంలో ఏర్పాటుచేసిన శ్రీ సంత్ రామారావు మహరాజ్ విగ్రహాన్ని బుధవారం ఉదయం 11.15 గంటలకు ప్రతిష్టించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు ఏర్పాటు పూర్తిచేశారు. మధ్యాహ్నం 1 గంటలకు అన్నదానం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి తండాల్లో ఉన్న సేవాలాల్ మహరాజ్ భక్తులు తరలిరావాలని సంఘ పెద్దలు రాథోడ్ శంకర్ నాయక్, అనార్‌పల్లి సర్పంచ్ శేషరావు కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

వాంకిడి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ విమలబాయి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

కబడ్డీ పోటీలు

కెరమెరి: పార్డా గ్రామంలో బుధవారం నుంచి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, సర్పంచ్ తలండి భీంరావు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఎంట్రీ ఫీజు రూ.401 ఉంటుందన్నారు.


కంటి పరీక్షలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ మినీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల చివరి వరకు ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

దాసనవమి

ఆసిఫాబాద్‌అర్బన్: మాఘమాస నవమిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ హనుమాన్ ఆలయంలో బుధవారం దాసనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు అర్చకుడు అభయ్‌కుమార్ ఆచార్య ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకం, పూజలు ఉంటాయన్నారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్: వాలైంటైన్స్ డేను వ్యతిరేకిస్తూ జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో గోమాతకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి విరుద్ధంగా విదేశీ సంస్కృతిని ఆచరిస్తూ నేటి యువత ప్రేమికుల దినోత్సవం జరుపుకోవడం శోచనీయమన్నారు. దీనికి వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో గోమాతను కౌగిలించే దినోత్సవం జరుపుకోవాలన్న సూచనల మేరకు స్థానిక పొట్టి శ్రీరాములు చౌక్, బ్రాహ్మణవాడలో గోమాతకు పూజలు చేశారు. పార్టీ నాయకులు ఈదులవాడ గణేశ్, జయరాజ్, తిరుపతి, పూర్ణచందర్, మహేందర్, వేణుగోపాల్, సంతోశ్, బన్నీ, వినోద్ పాల్గొన్నారు.